సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)
ఆదివారం | 30 | జూన్ | 2024



బెనిఫిట్స్ చెల్లింపులో జాప్యం
కేయూలో ఉద్యోగ విరమణ చేసిన నాన్‌టీచింగ్ సిబ్బందికి అధికారులు సకాలంలో బెనిఫిట్స్ చెల్లించడం లేదు.
- 8లో



మండలానికో సహకార బ్యాంక్
ప్రతీ మండలంలో సహకార బ్యాంకు ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ఉన్నామని వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు తెలిపారు.
- 8లో

గరిష్టం/కనిష్టం
34.6° /22.7°

వాతావరణం
జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తుంది. సాయంత్రం ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సెలవుపై అకౌంట్స్ ఆఫీసర్!
హన్మకొండ: అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వరంగల్ రీజియన్ అకౌంట్స్ ఆఫీసర్‌ను టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం సెలవుపై పంపినట్లు సమాచారం. 'సాక్షి'లో వచ్చిన కథనాలపై యాజమాన్యం విచారణ చేపట్టింది. ముందుగా ఆర్టీసీ విజిలెన్స్ విభాగాధికారులు విచారణ జరిపి నివేదికను యాజమాన్యానికి అందించారు. తర్వాత డిపార్ట్‌మెంట్ ఎంక్వైరీకి ఆదేశించారు. ఆమె వరంగల్ రీజియన్‌లో విధులు నిర్వహిస్తే విచారణ పారదర్శకంగా జరగదనే సందేహాలు వ్యక్తం కావడంతో ఆర్టీసీ ప్రధాన కార్యాలయానికి సరెండర్ చేశారు. కాగా.. ఇటీవల ఆమెను యాజమాన్యం ఫోర్స్‌డ్ లీవ్‌పై పంపినట్లు ఆర్టీసీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. అద్దె బస్సు యజమానుల వద్ద ముడుపులు తీసుకున్నట్లు, పెన్షనర్లు, ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టర్లను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు వచ్చిన ఆరోపణలపై విచారణ సాగుతోంది. ఇప్పటికే ఆమె స్థానంలో కరీంనగర్ రీజియన్ అకౌంట్స్ ఆఫీసర్ వెంకటేశ్వర్లును ఇన్‌చార్జ్‌గా నియమించిన విషయం తెలిసిందే.

ముగిసిన స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాల ఎంపిక
వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో రెండ్రోజుల పాటు హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ స్పోర్ట్స్ స్కూల్‌లో నాలుగో తరగతిలో ప్రవేశాలకు నిర్వహించిన ఎంపికలు శనివారం ముగిశాయి. హనుమకొండ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి బాలబాలికలు 60 మంది హాజరుకాగా.. వారికి బ్యాటరీ పరీక్షలు నిర్వహించినట్లు డీవైఎస్‌ఓ అశోక్ తెలిపారు. ఇందులో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జూలై 9, 10 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి ఎంపికలకు పంపించనున్నట్లు తెలిపారు.

వరంగల్‌లో..
కాశిబుగ్గ: స్పోర్ట్స్ స్కూళ్లలో నాలుగో తరగతిలో ప్రవేశాలకు వరంగల్ జిల్లాస్థాయి ఎంపిక పోటీలు శనివారం ముగిశాయని జిల్లా యువజన, క్రీడల అధికారి సత్యవాణి తెలిపారు. నగరంలోని ఓ సిటీ స్టేడియంలో చివరి రోజు వరంగల్, ఖిలావరంగల్, గీసుకొండ, సంగెం మండలాల నుంచి వచ్చిన ఇద్దరు విద్యార్థుల సర్టిఫికెట్లు పరిశీలించి పోటీలు నిర్వహించినట్లు ఆమె పేర్కొన్నారు. మూడు రోజులుగా జరిగిన ఈ ఎంపికల్లో జిల్లా వ్యాప్తంగా మొత్తం 28 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థుల సమాచారం అందిస్తామని చెప్పారు.

కోటను సందర్శించిన శ్రీలంక జర్నలిస్టులు



ఖిలా వరంగల్: ఖిలా వరంగల్ కోటను శనివారం శ్రీలంక దేశానికి చెందిన 30 మంది జర్నలిస్టులు సందర్శించారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న శ్రీలంక దేశానికి చెందిన పలు పత్రికల జర్నలిస్టులు మధ్య కోటలో పర్యటించారు. కోట అందాలను, శిల్ప సౌందర్యాన్ని వెంట తెచ్చుకున్న కెమెరాల్లో బంధించారు. కాకతీయుల చరిత్ర, విశిష్టతను శ్రీలంక జర్నలిస్టులకు టూరిజం డిపార్ట్‌మెంట్ ఉద్యోగి కుసుమ సూర్య కిరణ్ వివరించారు. వారి వెంట టీఎస్‌టీడీసీ కోట అజయ్, ఇన్‌చార్జ్ మార్గ కుమారస్వామి, సీఎంహెచ్‌ఆర్ అధికారులు తదితరులున్నారు.

రుద్రేశ్వరుడికి ప్రత్యేక పూజలు
హన్మకొండ కల్చరల్: వేయిస్తంభాల దేవాలయాన్ని శనివారం శ్రీలంక దేశానికి చెందిన జర్నలిస్టులు సందర్శించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు.

ఆర్వోల వారీగా మండలాల కేటాయింపు
వరంగల్: తెలంగాణలోని రిజిస్ట్రేషన్ కార్యాలయాల పరిధిని నిర్ణయిస్తూ ప్రభుత్వం శనివారం జీఓను జారీ చేసింది. ఈ జీఓ ప్రకారం.. వరంగల్ జిల్లా పరిధి గీసుకొండ, సంగెం మండలాలతో పాటు వరంగల్ మండలంలోని దేశాయిపేట, లక్ష్మీపురం, పైడిపల్లి, కొత్తపేట, మట్టెవాడ, ఏనుమాముల రెవెన్యూ గ్రామాల్లోని అన్ని బ్లాక్‌లు, వార్డులకు చెందిన భూ క్రయ, విక్రయాలకు వరంగల్ రూరల్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు చేయించుకోవాల్సి ఉంటుందని కార్యాలయ అధికారులు తెలిపారు.

వరంగల్ ఆర్వో కార్యాలయంలో...
కాజీపేట అర్బన్ : హనుమకొండ జిల్లాలోని వరంగల్ ఆర్వో రిజిస్ట్రేషన్ కార్యాలయంలో కాజీపేట, హనుమకొండ, హసన్‌పర్తి మండలాలు యథాతథంగా కొనసాగుతుండగా వరంగల్‌పోర్ట్ నుంచి ఐనవోలు మండలంతో పాటు జీడబ్ల్యూఎంసీ పరిధిలోని వార్డులను వరంగల్ ఆర్వోకు మార్చారు.

పరిశీలన.. సమీక్ష



ఐదు గంటలపాటు సాగిన సీఎం వరంగల్ పర్యటన

- బిజీబిజీగా గడిపిన రేవంత్‌రెడ్డి
- కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో వనమహోత్సవం లోగో ఆవిష్కరణ
- అనంతరం మొక్కలు నాటి పార్కు ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించిన సీఎం
- వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనుల పరిశీలన
- వివరాలను సీఎంకు తెలిపిన అధికారులు
- హనుమకొండ కలెక్టరేట్‌లో మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం
- గ్రేటర్ వరంగల్ అభివృద్ధిపై సుదీర్ఘ సమీక్ష

సాక్షి, వరంగల్ :

వరంగల్, హనుమకొండ జిల్లాల్లో శనివారం సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన బిజీబిజీగా సాగింది. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఐదు గంటలపాటు గడిపిన ముఖ్యమంత్రి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు, ఆ తర్వాత వరంగల్‌లోని 24 అంతస్తుల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనుల పరిశీలన, అక్కడి నుంచి హనుమకొండలోని సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభించిన అనంతరం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం హంటర్ రోడ్డులోని మెడికవర్ ప్రైవేట్ ఆస్పత్రి ప్రారంభించిన అనంతరం హైదరాబాద్‌కు వెళ్లారు. ఈ పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, సీతక్క, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్.నాగరాజు, మామిడాల యశస్వినిరెడ్డి, మురళీ నాయక్, ప్రభుత్వ విప్ రాంచంద్రు నాయక్, సీఎం వ్యవహారాల సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి తదితరులున్నారు. అలాగే సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవి గుప్తా, ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రోనాల్డ్ రోస్, టీఎస్‌ఐఐసీ జోనల్ మేనేజర్ రామా సంతోశ్‌కుమార్, సీసీఎఫ్ భీమానాయక్, ప్రిన్సిపల్ సెక్రటరీ హన్మంత్, అటవీ రక్షణ విభాగం ఉన్నతాధికారి డోబ్రియల్, ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి, వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా, కలెక్టర్లు సత్య శారదాదేవి, ప్రావీణ్య, కమిషనర్ అశ్విని తానాజీ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి నిర్మాణ పనుల పరిశీలన..
వరంగల్‌లో నిర్మాణంలో ఉన్న 24 అంతస్తుల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి 2.35 గంటలకు సీఎం చేరుకున్నారు. భవన నిర్మాణ ప్లానింగ్‌ను ఎల్‌అండ్‌టీ కంపెనీ ప్రతినిధులు సీఎంకు వివరించారు. డీఎంఈ వాణి, హెల్త్ సెక్రటరీ క్రిస్టియానాతోపాటు పనులను చూస్తున్న కంపెనీ సభ్యులు నిర్మాణం జరుగుతున్న తీరు, ఎక్కడెక్కడ ఏ సదుపాయాలు వస్తున్నాయనే వాటిపై సైట్ ప్లాన్లను వివరించారు. పనుల పురోగతిని సీఎం పరిశీలించారు.

మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం..
హనుమకొండలోని సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయానికి సీఎం ప్రత్యేక బస్సులో 3.03 గంటలకు వచ్చారు. 3.10 గంటలకు మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభించారు. అనంతరం సీఎం స్నాక్స్ తీసుకోగా, మంత్రులు, ఎమ్మెల్యేలు భోజనాలు చేశారు. దాదాపు 20 నిమిషాల పాటు అక్కడే గడిపారు. వరంగల్, హనుమకొండ జిల్లాల్లోని మహిళా సంఘాలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. అనంతరం కాన్ఫరెన్స్‌హాల్‌లో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి పనులపై సమీక్షించారు.

- సాయంత్రం 6.12 గంటలకు అక్కడి నుంచి బయటకు వచ్చి హంటర్ రోడ్డులోని ప్రైవేట్ ఆస్పత్రి ప్రారంభానికి వెళ్లారు.
- హెలికాప్టర్‌లో వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి.. పర్యటన షెడ్యూల్ ఆలస్యం కావడంతో అప్పటికే హెలికాప్టర్ టేకాఫ్ సమయం మించిపోగా.. బస్సులో రోడ్డు మార్గాన హైదరాబాద్ వెళ్లారు.

హనుమకొండ కలెక్టరేట్‌కు వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో మంత్రులు రాజనర్సింహ, పొంగులేటి, కొండా సురేఖ, ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యేలు



మెగా టెక్స్‌టైల్ పార్కులో సందడి
సీఎం రేవంత్ రెడ్డి మధ్యాహ్నం 1.16 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో గీసుకొండ మండలంలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో దిగి ప్రత్యేక బస్సు ఎక్కారు. సీఎంతో పాటు సీఎస్ శాంతికుమారికి కలెక్టర్ సత్యశారదాదేవి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.

1.34 గంటలకు కైటెక్స్ కంపెనీ భూమిలో వన మహోత్సవం లోగోను మంత్రులు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అనంతరం సీఎం మొక్కలు నాటి నీళ్లు పోశారు.

1.38 గంటలకు ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించడానికి, అధికారులతో సమీక్షించడానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శిబిరంలోకి వెళ్లారు. ఈ సందర్భంగా టెక్స్‌టైల్ పార్కుకు ఇప్పటి వరకు ఎన్ని కంపెనీలు వచ్చాయి, ఎంత మందికి ఉపాధి లభిస్తుందనే వివరాలతోపాటు పార్కుకు సంబంధించిన సమగ్ర వివరాలను ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్, ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు.

మధ్యాహ్నం 2.02 గంటలకు ప్రత్యేక బస్సులో సీఎం రేవంత్ రెడ్డి వరంగల్‌లో నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి బయలుదేరారు. సుమారు నాలుగు కిలోమీటర్ల పొడవునా సీఎం బస్సు వెంట కార్ల ర్యాలీ నగరానికి వచ్చింది.



సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులు పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, పక్కన మంత్రులు కోమటిరెడ్డి, పొంగులేటి, రాజనర్సింహ, కొండా సురేఖ, కలెక్టర్ సత్య శారదాదేవి



మహిళలకు ఆస్తులు అందజేస్తున్న సీఎం రేవంత్, మంత్రి సీతక్క, సీఎస్ శాంతికుమారి



మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించి స్నాక్స్ తింటున్న సీఎం, మంత్రులు

భూములిచ్చిన రైతులకు ఇందిరమ్మ ఇళ్లు
- ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం
- కాకతీయ మెగా టెక్స్‌టైల్‌పార్కు సందర్శనలో సీఎం రేవంత్‌రెడ్డి

వివరాలు 8లో

బీఆర్‌ఎస్ నాయకుల గృహ నిర్బంధం
- దామెరలో గ్రీన్‌ఫీల్డ్ హైవే బాధిత రైతుల అరెస్ట్
- పోలీసుల అదుపులో విద్యార్థి సంఘాల నేతలు

గ్రేటర్ వరంగల్‌కు మహర్దశ

- రూ.6,115 కోట్లతో ప్రాథమిక అంచనాలు సిద్ధం
- హెరిటేజ్ సిటీగా వరంగల్ అభివృద్ధికి రేవంత్‌రెడ్డి హామీ
- 'గ్రేటర్'కు 'మాస్టర్ ప్లాన్–2050'... ఔటర్ రింగ్ రోడ్డుకు మోక్షం
- అండర్ గ్రౌండ్ డ్రెయినేజీపై కదలిక.. సమగ్ర ప్రాజెక్టుకు ఆదేశం



గ్రేటర్ వరంగల్ అభివృద్ధిపై సమీక్షిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, డీజీపీ రవిగుప్తా, హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి తదితరులు

సాక్షిప్రతినిధి, వరంగల్: గ్రేటర్ వరంగల్‌కు ఇక మహర్దశ పట్టనుంది. హైదరాబాద్ తరహాలో వరంగల్ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాథమిక అంచనాలు సిద్ధం చేసింది. ముఖ్యమంత్రిగా మొదటిసారి శనివారం వరంగల్ నగరంలో అధికారికంగా పర్యటించిన సీఎం ఎ.రేవంత్‌రెడ్డి నగర సమగ్రాభివృద్ధికి ప్రధానంగా ఎనిమిది అంశాలపై దృష్టి పెట్టారు. ఈ మేరకు శనివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు పర్యటించి, పరిశీలించి, సుదీర్ఘంగా ఆయన సమీక్ష జరిపారు. ఇప్పటికే వివిధ స్థాయిల్లో ఉన్న ఎనిమిది అభివృద్ధి పథకాల పూర్తికి రూ.6,115 కోట్లు ఖర్చు కాగలదని ప్రాథమిక అంచనాల్లో తేలిందని ప్రకటించారు. వరంగల్‌ను హెరిటేజ్ సిటీగా అభివృద్ధి చేసేందుకు చేపట్టాల్సిన కార్యాచరణను అధికారులకు సూచించిన సీఎం రేవంత్‌రెడ్డి.. అంశాల వారీగా డెడ్‌లైన్ విధించి పూర్తి చేయాలన్నారు.

ఇన్‌చార్జ్ మంత్రి... ఇరవై రోజులకోసారి..
హైదరాబాద్‌తో పోటీపడేలా వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేస్తామన్న సీఎం.. మాస్టర్‌ప్లాన్–2050, రింగ్ రోడ్డు, స్మార్ట్ సిటీ, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, విమానాశ్రయం, కాళోజీ కళాక్షేత్రం, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి తదితర పనులను ప్రథమ ప్రాధాన్యంగా సూచించారు. వరంగల్‌లో భారీ వర్షాలు కురిసినప్పుడు కాలనీలు మునిగిపోకుండా శాశ్వతంగా పరిష్కారం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో చేపడుతున్న కొత్త పద్ధతులను వరంగల్‌లో ప్రయోగించాలని, అక్కడ వరదలు వచ్చినప్పుడు ఏం చర్యలు తీసుకుంటున్నారో ఇక్కడ అమలు చేయాలని కూడా సూచించారు. ఈక్రమంలో రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి 20 రోజులకోసారి వరంగల్ అభివృద్ధిపై సమీక్ష నిర్వహించి చర్యలు చేపడతారని సీఎం స్పష్టం చేశారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం పూర్తి, ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న వరంగల్ అభివృద్ధికి సమగ్రమైన మాస్టర్ ప్లాన్–2050ను రూపొందించనున్నట్లు తెలిపారు. ఉత్తర తెలంగాణకు కేంద్రంగా ఉన్న వరంగల్‌లో హైదరాబాద్‌లో ఉన్న నిలోఫర్ ఆస్పత్రి తరహాలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామనడంతో సామాన్య ప్రజలకు వైద్యం మరింత అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. అత్యవసర సమయంలో ఆపరేషన్లు ఇతర వైద్యసేవలకు నిమ్స్‌లో అందిస్తున్నట్లుగా ఎంజీఎం ఆస్పత్రిలోనూ ఎన్‌ఓసీ ఇచ్చే అంశంపై పరిశీలన జరుపుతామని ముఖ్యమంత్రి వెల్లడించడం పేదలకు ఊరట కలిగించే అంశం. సుమారు 400 ఎకరాల వరకు భూసేకరణ జరగ్గా.. పెండింగ్‌లో ఉన్న మామునూరు ఎయిర్‌పోర్ట్‌పైనా సీఎం సమీక్షలో స్పష్టత ఇవ్వడంపై హర్షం వ్యక్తమవుతోంది. సుమారు రూ.2,089 కోట్ల వ్యయం కాగల అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ (యూజీడీ) నిర్మాణానికి సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు(డీపీఆర్)కు సీఎం అధికారులను ఆదేశించారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు అభివృద్ధి కోసం నిధులు వెచ్చించడానికి స్పష్టత ఇచ్చారు. సీఎం ఆదేశాలతో కీలకమైన ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్డు భూసేకరణకు అవసరమయ్యే నిధులకు సంబంధించి కూడా పూర్తి వివరాలను సీఎం కోరారు. నేషనల్ హైవే నుంచి ఔటర్ రింగ్ రోడ్డుకు కనెక్ట్ అయ్యేలా ఉండాలని, రింగ్ రోడ్డు నుంచి టెక్స్‌టైల్ పార్కుకు కనెక్టివిటీ ఉండేలా.. రోడ్డుమార్గం ఉండేలా చూడాలని సూచించారు.

పోతన.. యాతన!

- సమస్యల వలయంలో పోతన మహిళా హాస్టల్
- శిథిలావస్థకు చేరి ఊడుతున్న పెచ్చులు
- అపరిశుభ్రంగా టాయిలెట్స్
- ఇటీవల ఫ్యాన్ ఊడిపడి విద్యార్థినికి తీవ్రగాయాలు



పోతన మహిళా హాస్టల్ భవనం ఇదే

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ ఏర్పాటయ్యాక నిర్మించిన పోతన బాయ్స్ హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఆ హాస్టల్‌కు మరమ్మతులు చేపడుతున్నామని, అమ్మాయిలకు కేటాయిస్తామని అప్పటి వీసీ తాటికొండ రమేశ్ హయాంలో ఆగస్టు 2002లో బాత్‌రూమ్‌లకు టైల్స్ వేయించినట్లు, అందుకు రూ.3 లక్షలు వెచ్చించినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఆ తర్వాత న్యాక్ బృందం విజిట్ చేసే ముందు కూడా అన్ని హాస్టళ్ల మరమ్మతులు చేస్తున్నామని విద్యార్థులకు సెలవులిచ్చి హాస్టళ్లు మూసేశారు. అప్పట్లో పోతన హాస్టల్ భవనానికి కేవలం బయట మాత్రమే పెయింట్ వేయించారు. అందుకు రూ.6లక్షలు వెచ్చించినట్లు లెక్కలు చూపెట్టారు. అనంతరం గర్ల్స్ హాస్టల్‌గా మార్చేందుకు పోతన హాస్టల్‌కు ప్రహరీని రూ.25లక్షల వ్యయంతో నిర్మించారు. పోతనను బాయ్స్ హాస్టల్‌గానే కొనసాగించాలని గతేడాది కొన్ని రోజులపాటు విద్యార్థులు ఆందోళన చేసినా పట్టువీడకుండా అప్పటి వీసీ పోతన మహిళా హాస్టల్‌గా బోర్డు పెట్టి అందులో వసతి ఉన్న బాయ్స్‌ను క్యాంపస్‌లోని న్యూ పీజీ హాస్టల్‌కు పంపారు.

మరమ్మతులేవి?
అమ్మాయిలు ఉండేలా పోతన హాస్టల్‌లో మరమ్మతులు చేపట్టామని చెప్పిన అప్పటి యూనివర్సిటీ అధికారులు ఆహాస్టల్‌లో సుమారు 250 మంది విద్యార్థినులకు కేటాయించారు. ఇప్పుడు పలు సమస్యలతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరి పెచ్చులూడుతున్నాయి. హాస్టల్‌కు డ్రెయినేజీ వ్యవస్థ సరిగ్గాలేదు. విద్యార్థులు ఉపయోగించుకుంటున్న వాష్ రూమ్స్ టాయిలెట్స్‌ను సరిగ్గా శుభ్రం చేయించడం లేదని శుక్రవారం పోతన హాస్టల్‌ను సందర్శించిన కేయూ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి, కేయూ అభివృద్ధి అధికారి ఎస్.వాసుదేవరెడ్డి హాస్టళ్ల డైరెక్టర్ ఎల్పీ రాజ్‌కుమార్ గుర్తించారు. గురువారం రాత్రి పోతనహాస్టల్‌లోని ఓ గదిలో ఫ్యాన్ ఊడిపడడంతో ఎంఏ పొలిటికల్ సైన్స్ మొదటి సంవత్సరం చదువుతున్న సంధ్యపై పడి నుదుటికి తీవ్ర గాయమైంది. ఈఘటన అనంతరం పోతన హాస్టల్ విద్యార్థులు, వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులు ఆందోళన చేశారు. దీంతో రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి, కేయూ అభివృద్ధి అధికారి ఎస్.వాసుదేవరెడ్డి, కేయూ హాస్టళ్ల డైరెక్టర్ డాక్టర్ ఎల్‌పీ రాజ్‌కుమార్ హాస్టల్‌ను పరిశీలించారు. హాస్టల్ మెయింటెనెన్స్ సరిగ్గా లేదని, అపరిశుభ్రవాతావరణం ఉందని యూనివర్సిటీ అధికారులు గుర్తించారు.

'సమ్మక్క సారలమ్మ'కు మార్చే యోచన
పోతన హాస్టల్ విద్యార్థులను సమ్మక్క సారలమ్మ హాస్టల్ భవనంలోకి షిఫ్ట్ చేయాలనే ఆలోచనలో యూనివర్సిటీ అధికారులున్నారు. ఈభవనాన్ని ట్రైబల్ వెల్ఫేర్‌కు సంబంధించిన వారు రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించారు. కొన్ని నెలల క్రితం భవన నిర్మాణం పూర్తయ్యింది. ఇందులో 200 బెడ్స్ ఏర్పాటుకు ఇటీవల జరిగిన కేయూ పాలక మండలిలో ఆమోదం లభించినట్లు కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి శనివారం తెలిపారు.

సీఎం పర్యటనకు భారీ బందోబస్తు



సీఎం కాన్వాయ్ ముందు పరుగెడుతున్న సీపీ అంబర్ కిషోర్‌ఝా

వరంగల్ క్రైం: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హనుమకొండ, వరంగల్ జిల్లాల పర్యటన సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. టెక్స్‌టైల్ పార్కు నుంచి హనుమకొండ కలెక్టరేట్ వరకు అడుగడుగునా పహారా కాశారు. సీఎం పర్యటన ఏర్పాట్లను స్వయంగా డీజీపీ రవిగుప్తా పర్యవేక్షించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా క్షేత్రస్థాయిలో పర్యటించి అధికారులకు పలు సూచనలిచ్చారు. సీఎం పర్యటించే రోడ్డు మార్గంలో ట్రాఫిక్ పోలీసులు ఆంక్షలు విధించారు. జంక్షన్ల వద్ద అధిక సంఖ్యలో పోలీసులను ఉంచారు. సీఎం కాన్వాయ్ హనుమకొండ కలెక్టరేట్‌కు వచ్చిన సమయంలో నేరుగా సీపీనే ముందు పరుగెడుతూ సిబ్బందిని అప్రమత్తం చేశారు.

మరింత సుందరంగా భద్రకాళి ఆలయం

- దేవాదాయ, సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ హనుమంతరావు
- మాస్టర్‌ప్లాన్ పరిశీలన



మాస్టర్‌ప్లాన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ హనుమంతరావు

హన్మకొండ కల్చరల్: దేవాలయ అభివృద్ధికి రూపొందించిన మాస్టర్‌ప్లాన్ ప్రకారం.. పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని, ఆలయాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని దేవాదాయ, సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ హనుమంతరావు అన్నారు. శనివారం కమిషనర్ దేవాలయాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ఆలయ ఈఓ శేషుభారతి, అర్చకులు భద్రకాళి శేషు, వేదపండితులు కమిషనర్‌ను ఆలయ మర్యాదలతో స్వాగతించారు. కమిషనర్ హనుమంతరావు అమ్మవారిని దర్శించుకుని పూజలు జరుపుకున్నారు. అర్చకులు తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు, మహదాశీర్వచనం అందజేశారు. అనంతరం దేవాలయ అభివృద్ధికి రూపొందించిన మాస్టర్‌ప్లాన్‌ను, మాడవీధుల నిర్మాణ పనుల్లో భాగంగా ఆలయం పక్కనే ఉన్న భూమిని పరిశీలించారు. ఆలయాభివృద్ధికి అవసరమైన పనులు, నిధులు వివరాలతో నివేదిక సిద్ధం చేసి పంపాలన్నారు. కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ కమిషనర్ టి.శ్రీకాంతారావు, అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత, సమాచార పౌర సంబంధాల శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ జగన్, అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మణ్‌కుమార్, రీజినల్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

విద్యారణ్యపురి: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని హనుమకొండ జిల్లా సైన్స్ అధికారి, నేషనల్ గ్రీన్ కార్ప్స్ కన్వీనర్ ఎస్.శ్రీనివాస్‌స్వామి అన్నారు. శనివారం హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హైస్కూల్‌లో జిల్లాలోని ఉన్నత పాఠశాలల ఏకో క్లబ్ విద్యార్థులకు కవిత్వ, పోస్టర్ తయారీ పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'పర్యావరణం' పాఠ్యపుస్తకాల రచయిత డాక్టర్ చిందం రవీందర్ మాట్లాడుతూ.. భూమిని పునరుద్ధరించుకోవాలంటే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించాలన్నారు. కాగా.. జిల్లాలోని 23 ఉన్నత పాఠశాలల నుంచి విద్యార్థులు ఈపోటీల్లో పాల్గొనగా.. విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు. జ్ఞాపికలను, సర్టిఫికెట్లను జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్‌స్వామి అందజేశారు. రిసోర్స్‌పర్సన్లు డాక్టర్ సారంగపాణి, శేషగిరి, సంపత్, బి.సునీత, పాఠశాల ఉపాధ్యాయులు వి.జగన్నాథం, వీరప్రతాప్, ఆర్.నరేందర్, జి.వెంకటేశం, వకుళాభరణం శ్రీనివాస్ విద్యార్థులు పాల్గొన్నారు.

దూరవిద్య పరీక్షల్లో కాపీయింగ్

- 12మంది విద్యార్థుల డీబార్

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో శనివారం వివిధ పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన ఎస్‌డీఎల్‌సీఈ డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ కోర్సుల్లో రెండో సంవత్సరం విద్యార్థులు మాస్ కాపీయింగ్ చేస్తూ 12మంది పట్టుబడి డీబార్ అయ్యారని పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్.నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎ.నరేందర్ తెలిపారు. వరంగల్ ఎల్‌బీ కాలేజీలో ఇద్దరు, ఏఎస్‌ఎం కాలేజీలో ముగ్గురు, జనగామ జీడీసీలో ఆరుగురు, మంచిర్యాల జీడీసీలో ఒక్కరు డీబార్ అయ్యారు.

కేయూలో పలు ప్రతిపాదనలకు అనుమతి

కాకతీయ యూనివర్సిటీ కామన్ మెస్‌లో ఒకేసారి 300 మంది విద్యార్థులు కూర్చుని భోజనం చేసే విధంగా డైనింగ్ టేబుల్ కొనుగోలుకు అనుమతి లభించినట్లు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి శనివారం తెలిపారు. విశ్వవిద్యాలయ కేంద్ర గ్రంథాలయంలో బాలికల కోసం వాష్‌రూమ్, ఇతర సదుపాయాల ప్రతిపాదనలకు కూడా ఫైనాన్స్, పాలకమండలి అనుమతి ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు. సమ్మక్క–సారలమ్మ హాస్టల్ నూతన భవనంలో 200ల బెడ్స్ ఏర్పాటుకు కూడా అనుమతి లభించినట్లు పేర్కొన్నారు.

దొంగకు దేహశుద్ధి..

- పోలీసులకు అప్పగింత



చోరీకి యత్నించి పట్టుబడిన దొంగ

ఖిలా వరంగల్ : వరంగల్ రైల్వేగేట్ ప్రాంతంలోని పుప్పాల గుట్టకు చెందిన ప్రభుత్వ ఉద్యోగి రాజయ్య ఇంట్లో బీహార్ రాష్ట్రానికి చెందిన ఓ దొంగ శుక్రవారం అర్ధరాత్రి చోరీకి యత్నించాడు. కాగా దొంగ ఇంట్లోకి ప్రవేశిస్తున్న విషయాన్ని సీసీ కెమెరాల్లో ఇంటి యజమాని గమనించి స్థానికులకు సమాచారమిచ్చాడు. రాజయ్య ఇంటిని స్థానికులు చుట్టుముట్టి దొంగను చాకచక్యంగా పట్టుకున్నారు. పట్టుబడిన దొంగను స్తంభానికి కట్టేసి దేహశుద్ధి చేసి శనివారం మిల్స్ కాలనీ పోలీసులకు అప్పగించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ మలయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

బెనిఫిట్స్ చెల్లింపులో జాప్యం

- కేయూలో రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించని ప్రభుత్వం
- నిధుల కొరతే కారణం.. ఆందోళన చెందుతున్న పెన్షనర్లు



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఉద్యోగ విరమణ చేసిన నాన్‌టీచింగ్ సిబ్బందికి అధికారులు సకాలంలో బెనిఫిట్స్ చెల్లించడం లేదు. దీంతో 30 ఏళ్లకు పైగా సర్వీస్ చేసిన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాన్‌టీచింగ్ ఉద్యోగుల్లో ఎన్జీవో కేడర్‌లో 56 ఏళ్లు, క్లాస్‌ఫోర్త్ ఎంప్లాయీస్ 60 ఏళ్లకు ఉద్యోగ విరమణ పొందేవారు. గత ప్రభుత్వం ఉద్యోగ విరమణ వయస్సును 61 ఏళ్లకు పెంచిన విషయం విదితమే. దీంతో కొంత కాలంగా కొందరికి ఉద్యోగ విరమణ లేదు. మరికొందరు రిటైర్డ్ ఉద్యోగులు తమకు రావాల్సిన బెనిఫిట్స్ కోసం యూనివర్సిటీ చుట్టూ తిరుగుతున్నారు. సరెండర్ లీవ్స్, జీపీఎఫ్ ద్వారా రావాల్సిన లబ్ధి, కమిటేషన్, గ్రాట్యుటీ తదితర బెనిఫిట్స్ ఒక్కొక్కరికి రూ.లక్షల్లోనే చెల్లించాల్సి ఉంటుది. ఉదాహరణకు ఒక సూపరింటెండెంట్‌కు సర్వీస్ ఆధారంగా రూ.60 లక్షలకుపైగా బెనిఫిట్స్ యూనివర్సిటీ చెల్లించాలి. క్లాస్‌ఫోర్త్‌లో కూడా సీనియర్ ఉద్యోగి రిటైర్డ్ అయితే రూ.50 లక్షలకు పైగా చెల్లించాలి. కానీ, ఏ ఉద్యోగికైనా గ్రాట్యుటీ రూ.12 లక్షలకు పైగా రావాలి. కొన్నేళ్లుగా బెనిఫిట్స్ వాయిదా పద్ధతిలో చెల్లిస్తున్నారు. ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన వారికి వాయిదా పద్ధతిలో కూడా చెల్లించడం లేదు. మరోవైపు వెయిటింగ్ లిస్ట్ పెరిగిపోతోంది. ఇదే విషయాన్ని రిటైర్డ్ ఉద్యోగులు యూనివర్సిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నిధుల కొరత అని దాట వేస్తున్నారు. నాన్ టీచింగ్ ఉద్యోగుల్లో 20 మందికిపైగా ఉద్యోగ విరమణ పొంది బెనిఫిట్స్ కోసం ఎదురుచూస్తున్నారు. ఈఏడాది డిసెంబర్ వరకు మరికొందరు ఉద్యోగ విరమణ చేయనున్నారు.

ఆందోళతోనే వీఆర్ఎస్ కూడా..

కాకతీయ యూనివర్సిటీలో నిధుల లేమితో రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్ ఇవ్వడంలో జాప్యం జరుగుతోంది. దీంతో పలువురు వలంటరీ రిటైర్మెంట్ (వీఆర్ఎస్) తీసుకుంటున్నారు కూడా. అలా ఇప్పటికే ఇద్దరు ఉద్యోగులు వీఆర్ఎస్ తీసుకుని వెయిటింగ్ లిస్టులో ఉన్నారు. మరొకరు కూడా వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం.

బెనిఫిట్స్ రావడం లేదు..

కేయూలోని ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి వేతనాలు అందుతున్నాయి. కానీ, ఉద్యోగ విరమణ చేసిన వారికి బెనిఫిట్స్ రావడం లేదని చెబుతున్నారు. బెనిఫిట్స్ కోసం యూనివర్సిటీ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తున్నారా లేదా అనే అనుమానాలున్నాయి. ఈ నేపథ్యంలో యూనివర్సిటీకి వచ్చే అంతర్గత నిధుల నుంచే బెనిఫిట్స్ చెల్లిస్తున్నారని సమాచారం. దీంతో వ్యయం పెరిగిపోవడంతో అంతర్గత నిధులు కూడా సరిపోవడం లేదని తెలుస్తోంది.

బెనిఫిట్స్ చెల్లించండి : రిజిస్ట్రార్‌కు వినతి

ఉద్యోగ విరమణ చేసి సంవత్సరం అవుతోంది. వయస్సు పైబడి చేతకావడం లేదు. బెనిఫిట్స్ చెల్లిస్తే అప్పులు తీర్చుకుంటాం, పిల్లలకు పెళ్లి చేసి, ఇళ్లు కొనుగోలు చేసుకుంటాం అని ముగ్గురు పెన్షనర్లు కేయూ రిజిస్ట్రార్, అకౌంట్స్ విభాగంలో ఇటీవల వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెనిఫిట్స్ కోసం యూనివర్సిటీ చుట్టూ తిరుగుతున్నాం. తమకు ఇప్పటికైనా బెనిఫిట్స్ చెల్లించాలని కోరారు.

మండలానికో సహకార బ్యాంకు



మహాజన సభలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ రవీందర్ రావు, పక్కన అధికారులు, డైరెక్టర్లు

- డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు

హన్మకొండ : ప్రతీ మండలంలో సహకార బ్యాంకు ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ఉన్నామని వరంగల్ డీసీసీబీ, తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు తెలిపారు. ఈ మేరకు శనివారం హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో మహాజన సభ నిర్వహించారు. ఈ సభకు రవీందర్ రావు అధ్యక్షత వహించి మాట్లాడారు. సహకార బ్యాంక్‌ల సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే ఆలోచనలో పాలకమండలి ఉందన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.1,936 కోట్ల వ్యాపారం చేయగా, రూ.9.12 కోట్ల లాభాన్ని ఆర్జించినట్లు తెలిపారు. డీసీసీబీని లాభాల్లోకి తీసుకువచ్చిన సందర్భంగా ఉద్యోగులకు 65 రోజుల బోనస్ ఇస్తున్నట్లు ప్రకటించారు. వరంగల్ డీసీసీబీ పరిధిలో అన్ని మండలాల్లో ఏర్పాటు చేయాలని ఆలోచనలో ఉన్నామని, ఈ మేరకు సహకార సంఘాలు ఆర్థికంగా బలపడాలన్నారు. డీసీసీబీ ద్వారా రుణమాఫీకి అర్హులైన వారి జాబితా, నివేదికను ప్రభుత్వానికి పంపామన్నారు. డీసీసీబీ జీఎం శ్రీధర్ రూపొందించిన ప్రగతి నివేదికను చైర్మన్ రవీందర్ రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీఎస్ కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా మార్నేని రవీందర్ రావును సహకార సంఘాల చైర్మన్లు శాలువా కప్పి, మొక్కలు, పుష్పగుచ్ఛాలు అందించి సన్మానించారు. సమావేశంలో డీసీసీబీ వైస్ చైర్మన్ కుందూరు వెంకటేశ్వర్ రెడ్డి, జిల్లా సహకార అధికారులు సంజీవ రెడ్డి, నాగేశ్వర్ రావు, శైలజ, వెంకటేశ్వర్లు, రాజేందర్ రెడ్డి, వరంగల్ జిల్లా వ్యవసాయాధికారి ఉషా దయాళ్, హనుమకొండ జిల్లా వ్యవసాయాధికారి రవీందర్ సింగ్, డీసీసీబీ సీఈఓ ఎండి వజీర్ సుల్తాన్, జీఎం శ్రీధర్, డీజీఎంలు, ఏజీఎంలు, డైరెక్టర్లు, సహకార సంఘాల చైర్మన్లు పాల్గొన్నారు.

రైల్లో చోరీలకు పాల్పడిన దొంగ అరెస్ట్

- రూ.1.81లక్షల విలువైన బంగారు పుస్తెలతాడు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన జీఆర్పీ సీఐ నరేశ్



వివరాలు వెల్లడిస్తున్న జీఆర్పీ సీఐ నరేశ్

కాశిబుగ్గ : రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఓ దొంగను రైల్వే పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. జీఆర్పీ సీఐ నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్పీఎఫ్, జీఆర్పీలు సంయుక్తంగా వరంగల్ రైల్వే స్టేషన్–2, 3 ప్లాట్‌ఫాంలో తనిఖీలు చేస్తుండగా ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. అతడిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా 30.278 గ్రాముల బంగారు పుస్తెలతాడు లభించగా స్వాధీనం చేసుకుని విచారించారు. తనది ఖమ్మం జిల్లా బోనకల్లు మండలం చిరునోములకు చెందిన ఓరుగు అశోక్ అని హైదరాబాద్‌లో ఉంటూ ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నట్లు వివరించాడు. ఈక్రమంలో ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌లో రూ.లక్షన్నర దాకా పోగొట్టుకుని అప్పుల పాలయ్యాడు. వాటిని తీర్చేందుకు డబ్బులు లేకపోవడంతో వ్యసనాలకు బానిసై దొంగతనం చేసేందుకు నిర్ణయించుకున్నాడు. అందులో భాగంగానే ఈనెల 16వ తేదీన వరంగల్‌లో పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైల్లో వాష్ బెషిన్ వద్ద నిల్చున్న ఓ మహిళ మెడలో నుంచి మూడు తులాల బంగారు పుస్తెల తాడును దొంగిలించానని ఒప్పుకున్నాడు. పుస్తెల తాడును స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. పుస్తెలతాడు విలువ సుమారు రూ.1,81,668 ఉంటుందన్నారు. దొంగను పట్టుకోవడంలో చొరవ చూపిన ఆర్పీఎఫ్ ఏఎస్సై ఎం.వెంకటేశ్వరరావు, హెడ్‌కానిస్టేబుళ్లు ఎస్.రాజు, ఎం.వెంకటేశ్వరరావు జీఆర్పీ ఎస్సై ఐలయ్య, కానిస్టేబుళ్లు డి.రాము, ఎల్.రామారావు, ఆర్పీఎఫ్ సిబ్బంది మనోజ్‌కుమార్, సుర్జిత్‌కుమార్, రోహత్‌షలను ఉన్నతాధికారులు అభినందనలు తెలిపారు.

బీఆర్ఎస్ నాయకుల గృహనిర్బంధం

- దామెరలో గ్రీన్‌ఫీల్డ్ హైవే బాధిత రైతుల అరెస్ట్
- పోలీసుల అదుపులో విద్యార్థి సంఘాల నేతలు



విద్యార్థి నాయకులను పరామర్శిస్తున్న యాదవ రెడ్డి



దామెర: పోలీసుల అదుపులో బాధిత రైతులు



పోలీసుల అదుపులో రాకేశ్ రెడ్డి తదితరులు

హన్మకొండ /కేయూ క్యాంపస్ /దామెర : రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి శనివారం వరంగల్, హనుమకొండ పర్యటన నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. పలువురు విద్యార్థి సంఘాల నాయకులతో పాటు దామెరలో గ్రీన్‌ఫీల్డ్ బాధిత రైతులను పోలీసులు అరెస్ట్ చేశారు. హనుమకొండలో ఏనుగుల రాకేశ్ రెడ్డితో పాటు 40 మంది కార్యకర్తలను హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో పోలీసులు గృహ నిర్బంధం విధించారు. రెండ్రోజుల క్రితం హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్‌లో ప్రభుత్వ పనితీరును ప్రశ్నించడంతో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పోలీసులు హౌజ్ అరెస్ట్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, నిరుద్యోగులకు ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో సీఎం పర్యటనను అడ్డుకుంటామని చెప్పిన విద్యార్థి ఉద్యమకారులను కూడా అరెస్టు చేశారు. శుక్రవారం రాత్రి బీఆర్‌ఎస్‌వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్, సంఘం నాయకులు కంజర్ల మనోజ్, సూర్యకిరణ్‌ను అరెస్టు చేశారు. శనివారం బీఆర్‌ఎస్‌వీ కేయూ ఇన్‌చార్జ్ జెట్టి రాజేందర్‌తోపాటు పలువురిని అరెస్ట్ చేసి వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు.వారిని టీజీపీ రాష్ట్ర అధ్యక్షుడు మర్రి యాదవ రెడ్డితోపాటు పలువురు పరామర్శించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాపాలనలో పోలీసు పహారాలు, నిర్బంధాలు ఏంటని ప్రశ్నించారు. ఆరు నెలల పాలనకే ఇంత అభద్రతా భావమా.? అరాచకమా అంటూ దుయ్యబట్టారు.

గ్రీన్ ఫీల్డ్ హైవే భూనిర్వాసితుల అరెస్టు

గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసితులను శనివారం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. సీఎం వరంగల్ పర్యటనలో భాగంగా భూ నిర్వాసితులు నిరసన తెలిపే అవకాశం ఉన్నందున్న దామెర మండలంలోని ఊరుగొండ, పులుకుర్తి, పసరగొండ గ్రామాలకు చెందిన పలువురు రైతులను ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు రతలించారు. అనంతరం సాయంత్రం సొంత పూచీకత్తుపై వారిని విడిచిపెట్టినట్లు తెలిసింది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తమ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లకుండా ఇలా నిర్బంధించడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. అరెస్టయిన వారిలో బొల్లు సమ్మిరెడ్డి, సాయిరెడ్డి, ఓడేలు, రాఘవులు ఉన్నారు.

16 కిలోల గంజాయి స్వాధీనం

- ఏజెన్సీ ప్రాంతంపై ప్రత్యేక నిఘా
- ఏఎస్పీ మహేష్ బాబా సాహెబ్ గీతే



నిందితుడి అరెస్ట్ చూపుతూ వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ

ఏటూరునాగారం : మండల కేంద్రంలోని ఫారెస్టు చెక్‌పోస్టు వద్ద రూ.4లక్షల విలువైన గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఏటూరునాగారం ఏఎస్పీ మహేష్ బాబా సాహెబ్ గీతే విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. శనివారం సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై తాజుద్దీన్ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా, ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా ఏటపాక గ్రామానికి చెందిన పిల్లం సోమరాజు పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించాడు.గమనించిన పోలీసులు వెంబడించి అతడిని పట్టుకుని అదుపులోకి తీసుకుని విచారించగా రూ.4లక్షల విలువ చేసే 16 కిలోల గంజాయి లభ్యమైనట్లు తెలిపారు. అనంతరం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, గంజాయి రవాణాను అడ్డుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏటూరునాగారం సీఐ, ఎస్సై, సిబ్బంది రామారావు, గోపి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

భూములిచ్చిన రైతులకు ఇందిరమ్మ ఇళ్లు



వనమహోత్సవం లోగోను ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్, మంత్రులు సురేఖ, సీతక్క, సీఎస్ తదితరులు

ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం

- టౌన్‌షిప్ మాదిరిగా మౌలిక సదుపాయాలు కల్పించాలి
- కాకతీయ మెగా టెక్స్‌టైల్‌పార్కు సందర్శనలో సీఎం రేవంత్‌రెడ్డి



ఫొటో గ్యాలరీని తిలకిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

గీసుకొండ: జిల్లాలోని గీసుకొండ–సంగెం మండలాల పరిధిలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు కోసం భూములు ఇచ్చిన రైతులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రత్యేక హెలికాప్టర్‌లో శనివారం ఆయన టెక్స్‌టైల్ పార్కు సందర్శనకు వచ్చారు. ముందుగా కైటెక్స్ కంపెనీ భూమిలో మొక్కలు నాటి, టీఎస్ఐఐసీ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. అనంతరం అధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలతో పార్కు పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి రైతుల ఇళ్ల స్థలాల పంపిణీ సమస్యను సీఎం దృష్టికి తెచ్చారు. దీనిపై సీఎం స్పందిస్తూ పార్కు కోసం భూములు ఇచ్చిన రైతులకు ఒక్కో ఎకరానికి వంద గజాల ఇంటి స్థలాన్ని ఇస్తున్నట్లు తెలిపారు. అందులో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించాలని సూచించారు. ఇళ్ల స్థలాల ప్రాంతాన్ని టౌన్‌షిప్ తరహాలో అభివృద్ధి చేసి విద్యుత్, తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీ తదితర సదుపాయాలు కల్పించడంతోపాటు అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మిగిలిన 121 మంది రైతులకు పైలాన్ సమీపంలో త్వరగా ఇంటి స్థలాలను కేటాయించాలని సూచించారు. టెక్స్‌టైల్ పార్కు ప్రాంతం వర్షపు నీటితో బురద మయంగా మారుతుండటంతో గమనించిన సీఎం.. పార్కు ప్రాంతంలో 10 ఎకరాల స్థలంలో స్టోరేజీ ట్యాంకు (చెరువు)ను ఏర్పాటు చేసి నీటిని అందులోకి పంపాలన్నారు. దీని కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరగా.. ఇప్పటికే రూ.50 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామని అధికారులు వివరించారు. పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా టెక్స్‌టైల్ పార్కులో పరిశ్రమల నిర్మాణం, పురోగతి, వసతుల కల్పన గురించి సీఎం రేవంత్‌రెడ్డికి వివరించారు.

తరలివచ్చిన అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు

మంత్రులు కొండా సురేఖ, ధనసరి సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా, ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రోనాల్డ్ రోస్, టీఎస్ఐఐసీ జెడ్ఎం రామా సంతోష్‌కుమార్, సీఎం స్పెషల్ సెక్రటరీ డి.అజిత్‌రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీసీఎఫ్ భీమానాయక్, ప్రిన్సిపల్ సెక్రటరీ హన్మంతు, ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్, అటవీ సంరక్షణ విభాగం ఉన్నతాధికారి డోబ్రియల్, ఎన్పీడీసీఎల్ సీఎండి వరుణ్‌రెడ్డి, సీపీ అంబర్‌కిషోర్ ఝా, కలెక్టర్ సత్యశారదాదేవి, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీసీపీ రవీందర్, నగర మేయర్ గుండు సుధారాణి, ఎంపీలు కడియం కావ్య, బలరాం నాయక్, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు, నాయిని రాజేందర్‌రెడ్డి, యశస్వినిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి, ఎంపీపీలు భీమగాని సౌజన్య, కందకట్ల కళావతి, జెడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘ఇన్‌స్టా’లో పరిచయం..ఆపై లైంగికదాడి

- యువకుడిపై పోక్సో కేసు నమోదు
- అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలింపు

కమలాపూర్ : ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన బాలికను (పదో తరగతి పూర్తైన విద్యార్థి) నమ్మించి మాయమాటలతో లోబర్చుకుని లైంగిక దాడికి పాల్పడ్డ కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం మహమ్మద్‌నగర్‌కు చెందిన యువకుడు మల్డొడ్డి శంకర్‌పై అత్యాచారం, పోక్సో కేసు నమోదు చేసి అరెస్ట్ అనంతరం రిమాండ్‌కు తరలించినట్లు కమలాపూర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఇ.హరికృష్ణ శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల మండలానికి చెందిన ఓ బాలిక నాలుగేళ్లుగా కమలాపూర్ మండలంలోని తన తాత వద్ద ఉంటూ ఇటీవల పదో తరగతి పూర్తి చేసింది. ఈ నెల 23వ తేదీన ఆ బాలిక ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. బాధితురాలి మేనమామ ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బాలిక ఫోన్ నంబర్ ఆధారంగా ఆమె ఇంట్లోంచి వెళ్లే సమయంలో, వెళ్లిన తర్వాత ఎవరెవరితో మాట్లాడిందని కనుగొని కామారెడ్డి జిల్లా నుంచి సదరు బాలికతో పాటు శంకర్ అనే యువకుడిని పట్టుకుని కమలాపూర్‌కు తీసుకొచ్చారు. అనంతరం బాలిక మైనర్ కావడంతో హనుమకొండలోని భరోసా కేంద్రానికి తీసుకువచ్చి ఆమె నుంచి వాంగ్మూలం సేకరించారు. శంకర్‌తో తనకు ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడిందని, మాయమాటలు చెప్పి కరీంనగర్‌కు రమ్మని అక్కడి నుంచి మహమ్మద్‌నగర్‌కు తీసుకెళ్లి తనను లోబర్చుకుని లైంగికదాడికి పాల్పడ్డాడని బాధితురాలు తెలిపింది. దీంతో బాలికపై లైంగికదాడికి పాల్పడ్డ శంకర్‌పై అత్యాచారం, పోక్సో కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ సెల్ ఫోన్ వాడే సమయంలో పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు నిఘా పెట్టడంతో పాటు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

తాగొచ్చిన సారు.. ఆలస్యంగా టీచర్లు

- పిల్లలను బడికి పంపేదెలా?
- నిలదీసిన యువకుడి వీడియో వైరల్



మద్యం తాగి పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయుడు

కొత్తగూడ: ‘మద్యం తాగి సారు.. 11 గంటలకు టీచర్లు వస్తే మా పిల్లలను బడికి ఎలా పంపాలి’ అంటూ ఓ యువకుడు నిలదీసిన వీడియో శనివారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. వివరాలు ఇలా ఉన్నాయి.. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం కొత్తపల్లి గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఈక నారాయణ రెండ్రోజుల క్రితం పూటుగా మద్యం తాగి పాఠశాలకు వచ్చాడు. గమనించిన స్థానిక యువకుడు సదరు ఉపాధ్యాయుడిని నిలదీస్తూ వీడియో తీశాడు. మద్యం తాగి సారు.. ఆలస్యంగా టీచర్లు బడికి వస్తే తమ పిల్లలను ఎలా పాఠశాలకు పంపించాలని ప్రశ్నించాడు. అందుకే కొందరు పొగుళ్లపల్లి పాఠశాలకు, మరి కొందరు ప్రైవేట్ పాఠశాలకు పంపిస్తున్నారని చెప్పారు. కాగా వీడియో రికార్డు చేయొద్దంటూ పాఠశాల హెచ్ఎం జగ్గారావు యువకుడిని వారించాడు. అది కాస్త సోషల్ మీడియాలో వైరల్ కావడంతో చర్చనీయాంశమైంది. ఈ విషయమై ఏటీడీఓ భాస్కర్‌ను వివరణ కోరగా విషయం తెలిసిందని, పే యూనిట్ హెచ్ఎం దేవదాస్‌ను పంపి విచారించి నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు.

లారీ ఢీకొని వృద్ధుడి మృతి



నాగయ్య (ఫైల్)

తొర్రూరు : రోడ్డు దాటుతున్న వృద్ధుడిని లారీ ఢీకొనడంతో మృతి చెందిన ఘటన శనివారం తొర్రూరులో చోటుచేసుకుంది. ఎస్సై జగదీష్ తెలిపిన వివరాల ప్రకారం నెల్లికుదురు మండలం నైనాల గ్రామానికి చెందిన వృద్ధుడు నంగునూరు నాగయ్య(62) తన భార్యకు మందుల నిమిత్తం తొర్రూరుకు వచ్చాడు. మందులు తీసుకున్న తర్వాత రోడ్డు దాటుతుండగా ఎదురుగా అతివేగంగా వచ్చిన లారీ నాగయ్యను ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయపడిన వృద్ధుడిని స్థానికులు సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య పద్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. నాగయ్య సోదరుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.